వచ్చేనెల 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం

డిసెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ తగ్గ కేసులు రాజీ చేసుకోవాలని అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం కోర్ట్ హాల్‌లో పెండింగ్‌లో ఉన్న ఆయా పోలీస్ స్టేషన్లకు సంబంధించిన అధికారులతో, కోర్ట్ రిప్రజెంటేటివ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాజీపడదగిన కేసులను గుర్తించి బాధితులను, ముద్దాయిలను తక్కువ సమయంలో సమన్వయ జరిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పోలీస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశ్యాన్ని కక్షిదారులకు వివరించాలన్నారు. రాజీ వైపుగా ఇరుపక్షాల వారిని సమన్వయ పరచాలన్నారు. మనోవర్తి, భూతగాదాలు, చెక్‌బౌన్స్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. నరసాపురం టౌన్, రూరల్, మొగల్తూరు, యలమంచిలి, పోలీస్ స్టేషన్లకు సంబంధించిన పోలీస్ అధికారులు, రిప్రజెంటేటివ్‌లు పాల్గొన్నారు.

కూటమిలో కుంపట్లు..!

- టిడిపి, జనసేన, బిజెపి మధ్య బయటపడ్డ విభేదాలు
- కూటమి ఆత్మీయ సదస్సులో సీనియర్ నేతలు, ఎంఎల్‌ఎలు, ఇన్‌ఛార్జిలు సమస్యల ఏకరువు
- ఎవరికివారే తమ పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వలేదని అసంతృప్తి
- సమన్వయంతో కలిసి పని చేయాలి: ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్
- వ్యక్తిగత పొరపొచ్చాలకు పోవద్దు: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ
- వారం రోజుల్లో సులభంగా ఇసుక: మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో టిడిపి, జనసేన, బిజెపి మధ్య కొన్ని రోజుల నుంచి చాప కింద నీరులా ఉన్న విభేదాలు బట్టబయలయ్యాయి. టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్నచోట జనసేన, బిజెపి నేతలు, జనసేన ఎంఎల్‌ఎలు ఉన్నచోట టిడిపి, బిజెపి నేతలు తమ పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జిల్లాలోని కూటమి నేతల మధ్య కుంపటి తారాస్థాయికి చేరింది. స్థానిక మల్టీప్లెక్స్ వెనుక ఉన్న అల్లూరి శ్రీరామరాజు ఫంక్షన్ హాల్లో ఎన్‌డిఎ కూటమి ఆత్మీయ సదస్సు టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సదస్సుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లాలోని ఎంఎల్‌ఎలు, టిడిపి, జనసేన, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో తమ పార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదు అంటూ నేతలు పరస్పర ఆరోపణలకు దిగారు. టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడి పని చేస్తే కనీసం కార్యక్రమాలకు పిలిచే పరిస్థితి లేదన్నారు. బిజెపి భీమవరం నియోజకవర్గ కన్వీనర్ సురేంద్ర మాట్లాడుతూ కనీసం ప్రొటోకాల్ పాటించట్లేదని, చివరకు బ్యానర్లో సైతం ఫొటోలు వేయడం లేదని ఆరోపించారు. జనసేన సీనియర్ నేత కనకరాజు సూరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టిడిపికి 60 శాతం, జనసేనకు 30, బిజెపికి పది శాతం చొప్పున పదవులు కేటాయిస్తామని చెప్పినా అమలు కావట్లేదని, 'నేనే రాజు.. నేనే మంత్రి' అన్నట్టుగా ఉంటున్నారని అన్నారు. జనసేన పాలకొల్లు ఇన్‌ఛార్జి బన్ని వాసు మాట్లాడుతూ పాలకొల్లులో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ సోదరభావంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ మాట్లాడుతూ తమ కేడర్‌కు గుర్తింపు ఇవ్వడమే కాకుండా నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ రీసర్వేలో అనేక లోటుపాట్లు ఉన్నాయని, వాటిని చేయాలన్నారు. జిల్లాలో వ్యవసాయం, ఆక్వా, విద్యుత్, ఉచిత ఇసుక, రీసర్వే ఎంఎల్‌సి ఎన్నికలు, సాగునీటి సంఘాలు, సొసైటీ ఎన్నికలు, డెల్టా ఆధునికీకరణ, తాగునీటిపై సమావేశంలో ప్రధాన చర్చ సాగింది. ఈ సదస్సులో ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ రాజ్యసభ సభ్యులు తోట సీతారామలక్ష్మి బిజెపి నేత పాకా వెంకట సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి సదస్సులో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

పశ్చిమ ఎడారిగా మారే ప్రమాదం ఉంది

పులపర్తి రామాంజనేయులు, భీమవరం ఎంఎల్‌ఎ

గతంలో ధాన్యాగారంగా ఉన్న జిల్లాలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అవసరమైతే క్రాప్ హాలిడే ప్రకటించైనా ఆధునికీకరణ పనులు పూర్తి చేయాల్సిందే. లేకపోతే పశ్చిమ ఎడారిగా మారిపోయే ప్రమాదం ఉంది. గతంలో యనమదుర్రు డ్రెయిన్‌పై రూ.40 కోట్లతో నిర్మించిన మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉంది. వీరవాసరంలో 33 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. భీమవరంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు తెస్తే 600 ఎకరాల భూమి సేకరిస్తాం.

వశిష్ట వారధి నిర్మించాలి

బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎంఎల్‌ఎ

జిల్లాలో పర్యాటక కేంద్ర అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పేరుపాలెం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా గోదావరిపై వశిష్ట వారధి నిర్మించాలి.

వంద మెట్లు కిందకు దిగినా ఫలితం ఉండట్లేదు

బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ

పదేళ్లపాటు ఎంతో కష్టపడ్డా. నా ఆస్తులను సైతం అమ్ముకున్నా. కూటమిగా ఉన్నప్పుడు సమస్యలు రావడం సహజమే. అంతేగాని నాకు పదవి కావాలి. లీడర్ కావాలంటే నేనేమీ చేయలేను. వంద మెట్లు కిందకు దిగొచ్చినా వినకపోతే ఎలా. రాష్ట్రంలో ఒక రూల్ పెట్టాలి. దానికి అనుగుణంగా కూటమి నేతలు నడుచుకునేలా చర్యలు తీసుకోవాలి. ఇసుక విధానంలో మార్పు తీసుకురావాలి. స్టేట్‌హైవేలు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

కూటమి ఐక్యత కాపాడాలి

ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎంఎల్‌ఎ

ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పని చేసినట్లే ఇప్పుడు కూడా కలిసి ముందుకు సాగాలి. ఎటువంటి మనస్పర్థలు లేకుండా ఉండాలి. స్టేట్‌హైవేలు లేకపోవడంతో కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. ఉపాధి హామీ నిధులు గతంలో నియోజకవర్గానికి రూ.25 కోట్లు వచ్చేవి. ఇప్పుడు కేవలం ఆరు నుంచి ఏడు కోట్లు మాత్రమే వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలి.

జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకోవాలి

కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఉండి ఎంఎల్‌ఎ

జిల్లా పరిషత్ ఛైర్మన్ ఒక్కరే ఉన్నారు. నిధులు అన్నీ ఆ జిల్లాకే ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. అభివృద్ధి చేసేందుకు జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకోవాలి. ఆక్వా రంగానికి విద్యుత్ యూనిట్ కనీసం రూ.2 లేదా రూ.2.25 పైసలకు అందించాలి. నియోజకవర్గాల్లో ఏ పార్టీ ఎంఎల్‌ఎ ఉంటే ఆ పార్టీకి ఎక్కువ అవకాశం ఉంటుంది. మూడు పార్టీలు సమన్వయంతో కలిసి వెళ్లేందుకు ఇబ్బందులున్నా తప్పదు ముందుకు సాగాలి.

వారం రోజుల్లో ఇసుకను సులభతరం చేస్తాం

నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ మంత్రి

ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించాం. ఇలాగే గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు, సాగునీటి సంఘాలు, కోఆపరేటివ్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేలా పని చేయాలి. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వాటిపైనా దృష్టి పెట్టాలి. నరసాపురం నుంచి సిద్ధాంతం వరకు ఇసుక సమస్య ఉంది. వారం రోజుల్లో ఇసుక సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

వ్యక్తిగత పొరపొచ్చాలకు పోవద్దు

భూపతిరాజు శ్రీనివాసవర్మ, కేంద్ర సహాయ మంత్రి

మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలి. లేకపోతే అనేక ఇబ్బందులు వస్తాయి. పొరపొచ్చాలు జరిగినా, అవమానాలు ఎదురైనా అంతా కలిసి పని చేయాలి. అధివృద్ధి పోరు వదలాలి. వ్యక్తిగత పొరపొచ్చాలకు పోకూడదు. కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి

మంతెన రామరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు

రాష్ట్ర అభివృద్ధే కూటమి లక్ష్యం. కలిసి ఉన్నపోదే సమస్యలు వస్తాయి. వాటిని అధిగమించి ముందుకు సాగాలి. నాయకుల నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. ఎవరికి వారు తక్కువేమీ కాదు. గౌరవం ఇచ్చిపుచ్చుకుంటే ఎటువంటి ఇబ్బందులూ ఉండవు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

సమస్యలు పక్కన పెట్టి సమన్వయంతో అంతా పని చేయాలి. ప్రజల విశ్వాసాన్ని కోల్పోకుండా నమ్మకంతో ముందుకు సాగాలి. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలపై దృష్టి పెట్టాలి. ఓటర్ల నమోదుకు నాలుగు రోజులే అవకాశం ఉంది. నీటిసంఘాలు, సొసైటీ ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా చూడాలి. రీసర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారానికి త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారు. ఆక్వారంగ అభివృద్ధికి విద్యుత్ రాయితీ అందిస్తాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తీసుకెళ్లాలి. స్మార్ట్ మీటర్లు అడిగిన వారికే బిగించడం జరుగుతుంది. దీనిపై అపోహలు వద్దు.

డిఆర్‌సిలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

పథకాల అమల్లో ఐక్యంగా పని చేయాలి

జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి రవికుమార్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చిట్టచివరి లబ్ధిదారులకు చేరువ చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో రవికుమార్ అధ్యక్షతన జిల్లా సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, ఆక్వా కల్చర్ జిల్లాలో స్థిరీకరించే చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఇసుక అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 22ఎ భూముల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా పరిష్కరించాలని సూచించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ సంక్షేమ పథకాల గురించి కొంతమంది అధికారులకు అవగాహన లేకపోవడం సరికాదని, అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు సిఎస్‌ఆర్ నిధులు మంజూరు చేస్తానని కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో కొంత సాంకేతిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, వీటిని అధిగమించి సులువుగా ఇసుక సరఫరాకు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భీమవరం, ఆచంట ఎంఎల్‌ఎలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ ఇసుక సమస్యపై మాట్లాడగా, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఎర్ర కాలువ గట్లు తక్షణమే పటిష్టం చేయాలని అన్నారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రాన్ని తాత్కాలికంగా జిల్లా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న భవనంలో ఏర్పాటు చేయాలని కోరారు. నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలన్నారు. ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ తణుకులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన మిషనరీని అందజేస్తానన్నారు. ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎపి ఎస్‌సిపిసి ఛైర్‌పర్సన్ పీతల సుజాత జిల్లాలోని పలు సమస్యలపై మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీంఅస్మి, జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టరు బి.శివనారాయణరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ మంత్రి రవికుమార్

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ రాష్ట్రమంతా ఒక పండుగ వాతావరణంలో జరిగిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేటులో దీపం-2 పథకంలో భాగంగా 10 మంది లబ్ధిదారులకు మంత్రులు రవికుమార్, రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్‌ఎల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలి

సిపిఎం మండల మహాసభలో నేతలు

ప్రజాశక్తి - ఇరగవరం



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహామూర్తి

ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి అమలయ్యేలా చూడాలని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహామూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం మండల ఆరో మహాసభ రేలంగిలో బొంతు సత్యనారాయణ, జోగి సాక్షి స్మారక ప్రాంగణంలో ఇల్లందుపర్తి సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది. మహాసభలో నరసింహామూర్తి మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ప్రచారం చేసుకుంటుందని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ప్రకటించకపోవడం సిగ్గుచేటని అన్నారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని, ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు అనేక సమస్యలపై సతమతమవుతున్నారని, వీటిని పాలకులు గాలికొదిలేశారని అన్నారు. ఈ సమయంలో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. నిత్యావసరాల ధరలతో సతమతమవు తుంటే ట్రూఅప్ ఛార్జీల పేరిట విద్యుత్ భారాలు మోప డం దారుణమన్నారు. తొలుత పార్టీ పతాకాన్ని జన్ని మహాలక్ష్మి ఆవిష్కరించారు. పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడగా మండల కన్వీనర్ కామన మునిస్వామి మూడు సంవత్సరాల కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. ప్రతినిధులు దానిపై చర్చించారు. ఈ సభలో స్థానిక నాయకులు ఆంజనేయులు, జోగి సత్యనారాయణ, జోగి సాయి, దంపనబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పనిచేయాలి : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయంలో మంత్రి రామానాయుడుని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ప్రతి ఉన్నత పాఠశాలలలో ప్రత్యేక క్లాసులు నిర్వహించి, పదవ తరగతి ఉత్తీర్ణతలో పశ్చిమగోదావరి జిల్లాను మొదటి స్థానంలో నిలిచేలా చూడాలన్నారు. జిల్లాలో ప్రతి పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పాఠశాలల పనితీరును పరిశీలించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దాలన్నారు. జటిలమైన సమస్యలు తలెత్తితే వెనువెంటనే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మండల విద్యాశాఖాధికారులు గుమ్మళ్ల వీరస్వామి, ఆర్ఎన్ఎస్‌విజి.శర్మ, జిల్లా, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై పోరాడి దేశాన్ని కాపాడాలి

యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సంగీతకుమారి

ప్రజాశక్తి - భీమవరం

బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఎదుట ఫ్ల కార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

ప్రతిఒక్కరూ అవినీతిపై పోరాడి దేశాన్ని కాపాడాలని యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ పి.సంగీతకుమారి అన్నారు. భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం విజిలెన్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగులు యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు అవినీతి నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్గించేలా నినదిస్తూ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత కుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్యాంకు శాఖల్లో విజిలెన్స్ వారోత్సవాలు అక్టోబర్ 28 నుండి ఈ నెల మూడో తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడం, పిల్లలకు క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కస్తూరిభాయి మహిళా పాఠశాల, లూథరన్ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ విజిలెన్స్ అధికారి రమేష్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యనారాయణ, బ్యాంక్ చీఫ్ మేనేజర్లు రమణ, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

పేరుపాలెం బీచ్‌లో పలు శాఖల అధికారులతో ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్‌డిఒ దాసి రాజు అధికారులకు సూచించారు. మండలంలోని బీచ్‌లో శనివారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సముద్రంలో స్నానాలు చేసే పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు బారికేడ్ల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. గజఈతగాళ్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, ప్రాథమిక వైద్య శిబిరాల ఏర్పాటు, మహిళలకు దుస్తులు మార్చుకునే సౌకర్యం, తాగునీటి వసతి తదితర వాటిపై శాఖల వారీగా రాజు సమీక్షించారు. డిఎస్‌పి ఎంబిఎన్.మురళీకృష్ణ, డిఎల్‌పిఒ జ్యోతిర్మయి, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, తహశీల్దార్ కె.రాజకిషోర్, ఇఇపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, పంచాయతీరాజ్ ఎఇ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మోహన్‌రావు, కార్యదర్శులు ముచ్చర్ల చిన్న, జి.గంగన్న, బి.కృష్ణప్రసాద్, ఎంపిహెచ్ఇఒ ఎఎస్ఎన్.మూర్తి, ఎంపిటిసి అందే దొరబాబు పాల్గొన్నారు.

మాటల్లో చిత్తశుద్ధి.. చేతల్లో ఉండేనా..!

ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న వరుస ఘటనలు ప్రజల్లో కలవరం సృష్టించగా.. పాలకుల మాటల్లో చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా కన్పిస్తోంది. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై గ్రామసభ కలవరం సృష్టించగా, మద్యం బెల్టుషాపుల అంశం, రోడ్లపై గోతుల పూడ్చివేత అంశం పాలకుల మాటల్లో చిత్తశుద్ధి ఏపాటిదనే అంశం చర్చనీయాంశమైంది.

వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదన సుమారు సంవత్సరాల క్రితమే వచ్చింది. దీనిపై వైసిపి ప్రభుత్వం దుందుడుకుగా వెళ్లబోగా గ్రామసభలో ప్రజలు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపి, డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామసభలో తీర్మానం చేయడంతో ఆ ప్రక్రియ నిలిచింది. దీనిపై తర్వాత అధికార యంత్రాంగం ద్వారా పలు ప్రయత్నాలు చేసినా ప్రజల నుంచి గట్టి ప్రతిఘటనే ఎదురైంది. దీంతో వైసిపి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక మళ్లీ జిల్లా అధికారులు నేవీ ఆయుధ డిపోకు భూసేకరణ యత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా వంకావారిగూడెంలో ఇటీవల గ్రామసభ నిర్వహించగా పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు సైతం హాజరయ్యారు. జనం ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకించాక ఎంఎల్‌ఎ బాలరాజు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు కాబట్టి గ్రామస్తుల అభిప్రాయాన్ని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని, తన చేతుల్లో ఏమీ లేదని చెప్పడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంతంలో ఏ పని చేపట్టాలన్నా పీసా చట్ట ప్రకారం గ్రామసభ ఆమోదమే కీలకమని సదరు ప్రజాప్రతినిధికి తెలియదా అనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. అదే సమయంలో గిరిజనులు నేవీ ఆయుధ డిపోను ఎందుకు వ్యతిరేకిస్తున్నారనేది తెలుసుకునే ప్రయత్నం అటు అధికారులు, ఇటు అధికారపక్ష నేతల నుంచి జరగలేదని తెలుస్తోంది. ఒకసారి గిరిజనుల మనోగతం పరిశీలిస్తే పోలవరం నిర్వాసితుల కాలనీలు ఈ మండల పరిధిలోనే ఎక్కువ నిర్మించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన డంపింగ్ యార్డును కూడా ఇక్కడే ఏర్పాటు చేశారు. వీటికి అవసరమైన భూములను గిరిజనులు త్యాగం చేసి ఇచ్చారు. పరిహారం కోసం పోరాడారు తప్ప భూములు ఇవ్వలేమని నాడు చెప్పలేదు. అయితే నేడు నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే దాని నిర్మాణ పరిధిలో భూములు కోల్పోవడం తప్ప గిరిజనులకు ఎటువంటి సమస్యా ఉండదనుకుంటే పొరబడినట్లే. ఎందుకంటే నేవీ ఆయుధ డిపో రక్షణ రంగానికి సంబంధించినది.



కచ్చితంగా దాని రక్షణ పేరిట ఆ డిపో పరిధిలో సుమారు ఐదు నుంచి పది కిలోమీటర్ల మేర జన సంచారంపై కచ్చితంగా ఆంక్షలు ఉంటాయి. అదే జరిగితే గిరిజనులు అడవిలోకి వెళ్లడం, రోజువారీ కార్యకలాపాలకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఫలితంగా అడవికి గిరిపుత్రులు దూరంగా నెట్టేయబడుతారనేది బహిరంగ రహస్యం. ఈ పరిస్థితుల్లో వారి మనోగతం, ఆందోళన అర్థం చేసుకోకుండా జిల్లాలోని ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు అధికారపక్షంపై తీవ్ర వ్యతిరేకతను పెంచుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

మద్యం దుకాణాలు ప్రారంభమై 15 రోజులు దాటింది.

ఈ దుకాణాల ఏర్పాటు, ప్రారంభం విషయంలో కూటమి నేతలు అంతర్లీనంగా శాసించారు. అంతటితో ఆగకుండా కొన్నిచోట్ల బెల్టుషాపుల ఏర్పాటుకు లాటరీ వేసి మరీ అవకాశం కల్పించారు. ఆ పేరిట బెల్టుషాపు ఏర్పాటుకు అనుమతి దక్కించుకున్న వ్యక్తి దగ్గర నుంచి కొంత సొమ్ము తీసుకుని గ్రామాభివృద్ధికి నిధి అంటూ కలరింగ్ ఇచ్చారు. అయితే దీనికి భిన్నంగా బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే తాను బెల్టు తీస్తానంటూ సిఎం చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తుండటం గమనార్హం. ఈ హెచ్చరికలు ఖాతరు చేయకుండా తెలుగుతమ్ముళ్లే బెల్టుషాపుల ఏర్పాటులో కీలకంగా వ్యవహరిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీనిలో కొన్నిచోట్ల ఎంఎల్‌ఎల పాత్ర సైతం ఉండటం గమనార్హం. ఈ పరిస్థితుల్లో మద్యం ఏరులై పారుతుందనేది అందరికీ తెలిసిందే. దీపావళి రోజు, మరుసటి రోజు తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో చోటుచేసుకున్న హత్యల్లో మద్యం పాత్ర ఉండటం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే రెండు జిల్లాల పరిధిలో క్రైమ్‌రేటు పెరిగిందనేది వాస్తవం. ఇప్పుడు మద్యం ఏరులై పారుతుండటంతో పరిస్థితి మరింత భయానకంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు బెల్టుషాపుల నియంత్రణపై దృష్టి సారించి నిర్వాహకులపై కొరడా ఝుళిపిస్తే జిల్లా ప్రజలకు ఎంతోకొంత మేలు ఉంటుంది. లేనిపక్షంలో నేతల మాటల్లో చిత్తశుద్ధి లేదని జనం భావించే అవకాశం ఉంది.

ఇక గుంతలు పూడ్చే కార్యక్రమాలను జిల్లాలో ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభిస్తున్నారు. సంతోషం. అయితే అదేదో తూతూమంత్రంగా అయితే మళ్లీ నెల రోజుల్లోనే రోడ్లన్నీ గోతులతో నిండే ప్రమాదం ఉంది. గోతులను పూడ్చటంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలనేది ప్రజల డిమాండ్. కొంత బూడిద తీసుకొచ్చి వేసి కలరింగ్ ఇస్తున్నారనేది జనం విమర్శ. అలా కాకుండా గ్రావెల్‌తో పటిష్టంగా గోతుల పూడ్చివేత చేపట్టాలని జనం కోరుతున్నారు. దీంతోపాటు మార్జిన్లలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే వర్షం వస్తే నీరంతా రోడ్లపైనే నిలిచిపోవడానికి ప్రధాన కారణం జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడమే. రోడ్ల మార్జిన్లలో తుప్పలు తొలగించి నీరు రోడ్డుపై నిలబడకుండా చేయగలిగితే కొద్దిరోజులైనా రోడ్లు బాగుండే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు. మరి పాలకులు బెల్టుషాపులు, రోడ్లకు మరమ్మతుల విషయంలో ఎలా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

సిపిఎం నేత బ్రహ్మాజీరావు మృతి

ప్రజాశక్తి - నరసాపురం



బ్రహ్మాజీరావు (ఫైల్ ఫొటో)

సిపిఎం సీనియర్ నాయకులు బ్రహ్మాజీ రావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 11 గంటలకు కానూరు బ్రహ్మాజీరావు మృతి చెందారు. ఆయన పార్థీవ దేహానికి సిపిఎం బృందం పూలమాలలేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ బ్రహ్మాజీరావు ఉన్నత కుటుంబంలో పుట్టి సిపిఎం పట్ల ఆకర్షితులై, పార్టీ ఆధ్వర్యంలో జరిగే అనేక ప్రజా ఉద్యమాల్లో తనదైన పాత్రను పోషించారన్నారు. నరసాపురం డివిజన్ కార్యదర్శిగా పనిచేశారన్నారు. అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించిన బ్రహ్మాజీరావు సేవలు అనేకమన్నారు. పార్టీ నాయకుడిగానే కాకుండా సీనియర్ జర్నలిస్టుగా బంగారు బాట పత్రికను నడిపి ప్రజా సమస్యలను పత్రిక ద్వారా ప్రభుత్వానికి చేరవేయటంలో ఆయన కలంబాట పట్టారన్నారు. బ్రహ్మాజీరావు కుటుంబానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ, నారాయణరావు, కేతినీడి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి నాని పాల్గొన్నారు.

జీవిత నేపథ్యం

కానూరి బ్రహ్మాజీ రావు(83) 1942వ సంవత్సరంలో జన్మించారు. తుది శ్వాస వరకూ కమ్యునిస్టుగానే బతికారు. ఆదివారం ఉదయం 9 గంటలకు వారి స్వగృహం నుంచి పార్టీ ఆధ్వర్యంలో అంతిమయాత్ర ద్వారా దహనసంస్కార కార్యక్రమం జరుగుతుందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కుమారుడు కానూరి ఉదయ భాస్కర కృష్ణప్రసాద్(బుజ్జి) ప్రస్తుతం నరసాపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు.

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

భీమవరం: కానూరి బ్రహ్మాజీరావు మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పారీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. నరసాపురం పట్టణంలో కార్మిక సంఘాల నిర్మాణం, పేద ప్రజల ఉద్యమాలు, పార్టీ నిర్మాణంలో ఆయన ముఖ్యపాత్ర వహించారని కొనియాడారు. మీరాతో కలిసి పని చేశారని, చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. బ్రహ్మాజీరావు మృతి ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. బ్రహ్మాజీరావు కుటుంబ సభ్యులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోపల్లె కాల్వ విస్తరణ పనులకు శ్రీకారం

ప్రారంభించిన ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

కాళ్ల : కోపల్లె మురుగు కాలువల అభివృద్ధి పనులకు ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు శ్రీకారం చుట్టారు. శనివారం పెదఅమిరం గ్రామంలో కోపల్లె మురుగు కాలువ ప్రక్షాళన పనులను ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పెదఅమిరం గ్రామం నుంచి ఉలంపూడి వరకు ఏడు కిలోమీటర్ల మేర కాలువ అభివృద్ధి పనులను ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు సొంత నిధులతో పనులు ప్రారంభించారని డ్రైనేజీ శాఖాధికారులు వెల్లడించారు. వేలాది ఎకరాలకు మురుగు నీటిని బయటకు పంపే కోపల్లె కాలువ విస్తరణ పనులు చేయడం పట్ల పలు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచి జువ్వాది కిషోర్, కోరా రామ్మూర్తి, కఠారి వెంకట నరసింహరాజు, డ్రైనేజీ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా 'మానవత'

మండల శాఖ అధ్యక్షులు కె.లీలాప్రసాద్

ఆచంట : ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ముందుంటుందని మానవత మండల శాఖ అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్ అన్నారు. మండలంలోని మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆచంట వేమవరం గ్రామానికి చెందిన విశ్వనాధుల కనక మహాలక్ష్మికి ఆర్థికసాయం చేశారు. కనకమహాలక్ష్మి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మానవత సభ్యులు ఆమెకు అండగా నిలిచి మందుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మానవత మండల అడ్వైజరీ బోర్డు కో చైర్మన్ వేండ్ర శ్రీనివాస్, డైరెక్టర్ సంకురాత్రి సోమరాజు, ఎవికె.సత్యనారాయణ, పేక్ శాఖ్యర్, కోలాచాని తమ్మినీడి సత్యనారాయణమూర్తి, అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండా బత్తుల ఆనంద్ కుమార్‌లు పాల్గొన్నారు.

విజిలెన్స్ అంశాలపై అవగాహన

నరసాపురం : స్థానిక శ్రీవైఎన్.కళాశాల సామాజిక సేవా విభాగం, ఐక్యూ ఎసి, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అవినీతి నిరోధక, ఇతర విజిలెన్స్ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్‌పి ఎవిఐఎం.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విజిలెన్స్ అనగా నిఘా చేయడమనే అర్థం వస్తుందని, ఇవి చాలా రకాలుగా ఉంటాయన్నారు. అయితే ముఖ్యంగా అవినీతి అనేది ఈరోజున సమాజంలో అన్ని చోట్ల ఉందని, ఈ అవినీతి ఉద్యోగస్తులలోనే కాక అన్ని రంగాలలో ఉంటుందన్నారు. దానిని పారద్రోలే విషయంలో సామాన్య జనం, యువకులలోను తమతమ ముందడుగు వేయాలన్నారు. సమాజంలో మీ ఉండి చుట్టుపక్కల జరుగుతున్న విషయాలపై దృష్టి సారించి తమకు తెలియజేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్లు 14400 అవినీతి నిరోధక శాఖ, 112 పోలీసు శాఖ, 181 బాల్యవివాహాలు, 1930 సైబర్ క్రైమ్ గురించి తెలియజేయాలన్నారు. విద్యార్థులకు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘురామారావు పాల్గొన్నారు.

ముద్దాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తణుకు రూరల్ : రైతులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని ముద్దాపురం గ్రామంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 2024-25 ఖరీఫ్ సీజన్ కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం లోడు కలిగిన ట్రాక్టర్ జెండా ఊపి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రారంభం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతాంగానికి సేవ చేయడానికి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ధాన్యం అమ్మిన సొమ్ములు ఆరు నెలలు దాటిపోయినా కూడా రైతుల ఖాతాల్లో జమ చేయలేదని పరిస్థితి ఉండేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారని గుర్తు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరుడు దామిశెట్టి మృతి

యలమంచిలి : మండలంలోని కలగంపూడి గ్రామానికి చెందిన దామిశెట్టి(90) శనివారం మృతి చెందారు. ఆయన భార్య కొంతకాలం కిందటే మృతి చెందగా, ఆయనకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. 1970 మధ్యకాలంలో చించినాడ, కలగంపూడి గ్రామాలలో భూపోరాటాలు చేపట్టారు. అప్పట్లో జరిగిన మహా పోరాటంలో దామిశెట్టి ప్రముఖ పాత్ర వహించడంతో పోరాటంలో వీరోచితంగా పాల్గొన్నారు. ఆ సందర్భంలో ఆయన కాలు కూడా విరిగిన సంఘటనను ఆయన సహచరులు గుర్తుచేశారు. సిపిఎం మండల కార్యదర్శి కేతా బాలరాజు, మండల కమిటీ సభ్యులు దామిశెట్టి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పోత్తూరి నరసింహరాజు, గుబ్బల చక్రపాణి, గుబ్బల సత్యనారాయణ, గూడూరు వెంకటేశ్వరులు, కుమార్ పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ల పరిశీలన

నరసాపురం : నరసాపురం మున్సిపల్ కమిషనర్ అంజయ్య ప్రధాన వీధుల్లో, గోదావరి పుష్కరఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ పారిశుధ్య పనులను మరింత మెరుగు చేయాల్సినవున్నాయని, వశిష్ట గోదావరి నదిలో కార్తీకమాసంలో పుణ్యస్నానం చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా గోదావరి గట్టును శుభ్రం చేయాలి, నీరు తక్కువగా ఉన్న చోట్లలో కూడా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మోటార్ల ద్వారా జల్లు స్నానం ఏర్పాట్లు చేయిస్తున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేండ్ర ప్రసాద్, డిఇ ప్రవీణ్ చంద్ర, ఎఇలు కిషోర్, నవ్య పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ పరిశీలన

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం సౌత్‌లో రేషన్ సరుకుల పంపిణీ విధానాన్ని తహశీల్దార్ కె.రాజకిషోర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరుకులు అందుతున్న తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇదివే ఒకటో నెంబర్ చౌక డిపోను ఆయన పరిశీలించారు. దస్త్రాలు, స్టాకును పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ ఆవల ముచ్చర్ల నిరంజన్, విఆర్ఒ దుర్గారావు ఉన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్లను గుర్తించాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాలో ఉచిత ఇసుకను సులభంగా, సౌలభ్యంగా పంపిణీ చేసేందుకు నియోజకవర్గాల వారీగా స్టాక్ పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించి చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా ఇసుకపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అందుబాటులో లేదని పొరుగు జిల్లాల నుంచి జిల్లాకు తీసుకువచ్చి స్టాక్ చేసేందుకు అనువైన స్టాక్ పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు రీచ్ నుండి ఇసుకను పొందాల్సి ఉందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద మినరల్ డీలర్స్ లైసెన్సులు ఏజెన్సీలు జారీచేసే ఇసుక సరఫరా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డిఒలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా వెంకట సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గం కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నెక్కంటి వెంకట సత్యనారాయణ(సతీష్) నియమితులయ్యారు. ఈయన గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నెక్కంటి వెంకట సత్యనారాయణను పార్టీ కోఆర్డినేటర్‌గా నియమించింది పట్ల కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరికుమార్ రాజు, సీనియర్ నాయకులు కనుమూరి బాపిరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడు దారుణ హత్య

తాడేపల్లిగూడెం : స్థానిక వీకర్స్ కాలనీలో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడు రాజేష్(35) పెయింటింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి 1:30 సమయంలో ఎవరు వచ్చి, తల మీద తీవ్ర గాయాలతో, రక్తపు మడుగులో ఇంటి గుమ్మంలో రాజేష్ పడి ఉన్నట్టు, రాజేష్ తల్లి నాగదేవి ఇంటి పక్కన వాళ్లు పిలిచి చెప్పడంతో ఆమె వెంటనే స్థానికుల సహాయంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే రాజేష్ చికిత్స పొందుతూ మరణించినట్లు డ్యూటీ డాక్టర్లు తెలియజేశారు. సమాచారం అందుకున్న పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, అనుమానితులైన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అమెరికా-ఇజ్రాయిల్ దుర్మార్గ చర్యలు వీడాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ

నినాదాలు చేస్తున్న యువకులు

ప్రజాశక్తి - ఆచంట

ప్రపంచ శాంతికి, దేశాల మధ్య సమైఖ్యతకు విఘాతం కలిగిస్తోన్న అమెరికా, ఇజ్రాయిల్ దేశాల దుర్మార్గ విధానాలను దేశ ప్రజలంతా వ్యతిరేకించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ అన్నారు. డివైఎఫ్ఐ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆచంట-పాలకొల్లు ప్రధాన రహదారి దగ్గర సంతమార్కెట్ వద్ద యువకులతో కలసి డివైఎఫ్ఐ పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కన్వీనర్ తమరాపు దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో శర్మ మాట్లాడుతూ సామ్రాజ్యవాద విధానాలతో ప్రపంచ దేశాల మీద ఆధిపత్యం చెలాయించాలనుకుంటున్న అమెరికన్, ఇజ్రాయిల్ దేశాలు యుద్ధోన్మాదంతో అంతర్జాతీయ న్యాయస్థానాల చట్టాలను, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను తుంగలో తొక్కాయన్నారు. క్యూబా, పాలస్తీనా దేశ ప్రజల హక్కులను కాలరాసే పచ్చి దుర్మార్గమైన విధానాలు అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. ఐక్యరాజ్యసమితి గుర్తించిన సభ్య దేశమైన పాలస్తీనాలోని 90 శాతం భూభాగాన్ని అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఆక్రమించేసిందని తెలిపారు. ఒక దేశంపై మరో దేశం ఆక్రమణ చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. 39 లక్షల మంది పాలస్తీనియన్లను దురాక్రమణ దారులు మారణాయుధాలతో హత్య చేసారన్నారు. ఫెడరల్ కాస్ట్రో, చేగువేరాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడాన్ని సహించలేని అమెరికన్ పాలకులు 1958లో క్యూబా దేశాన్ని ఒంటరిపాలు చేయాలని అనేక ఆర్థిక ఆంక్షలు క్యూబా దేశంపై విధించారన్నారు. అయినప్పటికీ కరోనా, ఎబోలా లాంటి విపత్కర మహమ్మారుల నుంచి ప్రపంచాన్ని కాపాడడానికి క్యూబా వైద్య బృందాలు ప్రపంచ దేశాలకు అందించిన సేవలను ఒకసారి ప్రజలంతా గుర్తుంచుకోవాలని శర్మ తెలిపారు. అలీన దేశాల ఐఖ్యతకు భారతదేశం, క్యూబాతో కలసి నిర్వహించిన పాత్ర ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. భారతదేశంలో ప్రస్తుత మోడీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాద పాలకుల అడుగులకు మడుగులొత్తే విధంగా వ్యవహరిస్తోన్నారని మండిపడ్డారు. తక్షణమే పాలస్తీనాను ఆక్రమిస్తోన్న ఇజ్రాయిల్‌ను భారత ప్రభుత్వం బలపరిచే విధానాలను ఉపసంహరించుకోవాలని, భారతదేశ ప్రజలు అమెరికన్ సామ్రాజ్యవాద, యుద్ధోన్మాద చర్యలను నిరశిస్తూ క్యూబా, పాలస్తీనా దేశాల ప్రజలకు అండగా ఉండాలని, ప్రపంచ దేశాల మధ్య శాంతి, సౌహార్ధత, ఐఖ్యతా చర్యలకు సంఘీభావంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎ.సురేష్ బాబు, పి.మోహన్, ఐ.దిలీప్, బి.దుర్గాప్రసాద్, టి.పల్లపురాజు, జి.లాల్ బాబు పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్లే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

సంక్రాంతి లోపు రోడ్ల మరమ్మతు పనులు పూర్తిచేస్తాం

విద్యుత్ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రోడ్ల అభివృద్ధి ద్వారా మెరుగైన జీవన విధానం కలగజేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక చినఅమిరం కూడలిలో గుంతలు లేని రోడ్ల ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో ఏ రోడ్డు చూసినా పెద్ద పెద్ద గోతులతో ప్రయాణానికి వీలులేని విధంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లను అభివృద్ధి చేయడానికి లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందని తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను గుంతలు లేకుండా, సమాంతరంగా మరమ్మతులు చేపట్టేందుకు శనివారం పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో రూ.1,699 లక్షల వ్యయంతో ఏడు నియోజకవర్గాల్లోని 74 రోడ్ల మరమ్మతులకు నేడు శ్రీకారం చుట్టడం జరిగిందని, రానున్న వారం రోజుల్లో రూ.3,125 లక్షల వ్యయంతో మరో 114 రోడ్లకు మరమ్మతులను సంక్రాంతి నాటికి పనులు పూర్తిచేసే లక్ష్యంతో చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా రహదారులు, భవనాల శాఖ అధికారి ఎ.శ్రీనివాస్, డిఇఇ పి.వి.రామరాజు, ఎఇ.రాజశేఖర్, తహశీల్దార్ రావి రవికుమార్ పాల్గొన్నారు.

ఉండి : సంక్రాంతి నాటికి రోడ్లన్నీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి గుంతలు లేని రోడ్లే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తామని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అ న్నారు. శనివారం ఉండి మండలం మహాదేవపట్నం గ్రామంలో 'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమంలో భాగంగా రోడ్ల మరమ్మతు పనులను ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.826 కోట్ల నిధులు కేటాయించగా ఉండి నియోజకవర్గానికి రూ.6 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. అందులో ఉండి మండలానికి కేటాయించిన రెండు కోట్ల రూపాయల నిధులతో మండలంలోని రోడ్ల మరమ్మతులు ప్రారంభించామని, సంక్రాంతి నాటికి రోడ్లన్నీ సుందరవందనంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, గ్రామ సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పాడైన రోడ్లన్నీ జనవరి లోపు పూర్తి చేస్తామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని స్థానిక బాపూజీ పుంత రోడ్డు, ప్రతిపాడు నుంచి రోడ్ల మరమ్మతు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరంకుశత్వ పాలనలో రోడ్లన్నీ పాడయ్యాయని, కనీసం గోతులు కూడా పూడ్చలేని అసమర్థ పాలన వల్ల రోడ్లకు ఈ దుస్థితి పట్టిందన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ ఖజానాలను లూటీ చేసి మళ్లీ ఏ మొహం పెట్టుకొని కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు అంటూ వైసిపి నాయకులకి చురకలు అంటించారు. ప్రభుత్వ ఖజానాలో డబ్బులేని కారణంగా ప్రస్తుతానికి దాతల భాగస్వామ్యంతో తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, రూరల్ మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబి, చెరుకూరి జగత్ సోమశేఖర్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : తణుకు నియోజకవర్గంలో గుంతలు రహిత రోడ్లను నిర్మిస్తామని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని దువ్వ గ్రామంలో ఆయన మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.10 లక్షల వ్యయంతో దువ్వ-సూర్యారావుపాలెం ఆర్ అండ్ బి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో గుంతలు పూడ్చి రోడ్ల మరమ్మత్తులు చేసేందుకు తణుకు నియోజకవర్గంలో రూ.2 కోట్లతో 13 పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వచ్చే సంక్రాంతి నాటికి తణుకు నియోజకవర్గంలో ఎక్కడా ఒక గుంతకూడా లేని రోడ్లు దర్శనమిస్తాయన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

యలమంచిలి : గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు తమ ఎన్‌డిఏ ప్రభుత్వం రూ.800 కోట్లతో రహదారులు నిర్మించుటకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు-దొడ్డిపట్ల రహదారి మరమ్మతుల పనులను మండలంలోని అడవిపాలెం వద్ద శనివారం రూ.30 లక్షల వ్యయంతో పనులకు భూమి పూజలు చేసి, గుంతల పూడ్చే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఏ ప్రాంతం అయినా వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, శాంతి భద్రతలతో పాటు రహదారులు బాగుంటేనే ప్రాంతాలు, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో ఇంటింటికీ, వాడవాడకు సిమెంటు రోడ్లు వేసి అభివృద్ధి చేశారన్నారు. గ్రామాల నుంచి మండలాలకు, జిల్లాలకు అనుసంధానం చేస్తూ రహదారులను చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి సాక్షి ప్రకటనలకు ఖర్చుపెట్టిన రూ.300 కోట్లు కూడా కనీసం రోడ్లకు ఖర్చు పెట్టలేదని మంత్రి విమర్శించారు. మాజీ ఎంఎల్‌సి సభ్యులు అంగర రామ్మోహన్, డిఇలు బివి.రమణ, సిహెచ్.వెంకట నారాయణ, సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రికి విగ్రహాన్ని బహూకరిస్తున్న చిన్నా

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన చాగంటి

నరసాపురం : పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవి కుమార్ శనివారం భీమవరం పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా) మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించి, శాలువతో చిరు సన్మానం చేశారు. నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రిని చిన్నా కోరారు. అనంతరం ఎన్‌డిఏ జిల్లా ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గొట్టిముక్కల గాంధీ భగవాన్ రాజు

11 నుంచి ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్

పాలకొల్లు : ఈనెల 11 నుంచి 17 వరకు పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టిముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. తమ కాంప్లెక్స్‌తో పాటు పాలకొల్లు టౌన్ హాల్, నరసాపురం ఆఫీసర్స్ క్లబ్‌లో ఈ టోర్నమెంట్స్ ఈనెల 13, 14, 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17వ తేదీన ఫైనల్ మ్యాచ్ తమ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తామన్నారు. 13న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, నరసాపురం ఆర్‌డిఒలు పోటీలను ప్రారంభిస్తారని, 18న జరిగే బహుమతి ప్రధానోత్సవంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొంటారని అన్నారు. ఈనెల 5వ తేదీ వరకు టోర్నమెంట్‌లో ఆడేవారికి ఎంట్రీలు సేకరిస్తామని, 6న ఉప సంహరణకు ఆఖరి తేదీ అని చెప్పారు. మాజీ టెన్నిస్ క్రీడాకారులు చెరుకూరి బుద్ధావతారం రాజు స్మారక టోర్నమెంట్‌గా నిర్వహిస్తున్నట్లు, మొత్తం రూ.3 లక్షల ప్రైజ్‌మనీ ఇస్తున్నట్లు చెప్పారు. వివరాలకు జిఎస్‌విఆర్ఎస్ఎన్.రాజు నెంబర్‌ను 9885750999 సంప్రదించాలని కోరారు. సంఘ ఉపాధ్యక్షులు రుద్రరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

మద్యం పాలసీని వ్యతిరేకించాలి : సిపిఎం

ఆకివీడు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మద్యం పాలసీని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. శనివారం సాయంకాలం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు అధ్యక్షతన నూతన మద్యం పాలసీపై పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి ప్రజలను రోడ్డు మీదకు ఈడుస్తున్నారని విమర్శించారు. ప్రజలు తాగడానికి మంచినీళ్లు ఇవ్వలేని ప్రభుత్వం మద్యాన్ని మాత్రం ఏరుల్లా పారించేందుకు సన్నాహాలు చేశారన్నారు. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా చూడటం దారుణమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా కనకరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆచంట

మండల తహశీల్దార్‌గా జి.కనకరాజు శనివారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమలాపురం తహశీల్దారుగా ఎన్నికల సమయంలో పనిచేసి ఆచంటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడేరు, కరుగోరుమిల్లి గ్రామాల్లో ఉన్న ఇసుక ర్యాంపును త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. రేషన్ డీలర్లు విధిగా దుకాణాల వద్ద స్టాక్ రిజిస్టర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ దుకాణాలలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కందిపప్పు, పంచదార రేట్లు సరుకుల బోర్డుపై ఉంచాలన్నారు. పిడిఎస్ బియ్యం, నిత్యాసర సరుకులను అక్రమంగా అమ్మినా, కొనుగోలు చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లర్లకు ధాన్యాన్ని అమ్ముకోవచ్చు అని వెల్లడించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌కు డిప్యూటీ తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు, ఆర్ఐ జయలలిత, మండల విఆర్ఒల సంఘం అధ్యక్షులు ఎం.శేషగిరిరావు, విఆర్ఒలు, విఆర్ఎలు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎంపిపి దంపతులను సత్కరిస్తున్న వైద్యులు

అందరి సహకారంతో పిహెచ్‌సి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతల సహకారంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు అన్నారు. శనివారం కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షురాలు పెన్మెత్సశిరీష విశ్వనాధరాజు అధ్యక్షతన ఆరోగ్య కేంద్రం కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గత ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నెల వరకు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆసుపత్రి అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వంచే మంజూరు చేసిన రూ.87 వేలు ఆసుపత్రి అభివృద్ధి నిమిత్తం ఖర్చు చేయాలని తీర్మానించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ సరాబు సునిల్ ఆధ్వర్యంలో వైద్యాధికారిని డాక్టర్ డి.సునీత, సిబ్బంది, ఆసుపత్రి కమిటీ చైర్మన్ పెన్మెత్స శిరీష విశ్వనాధ్ రాజు, గ్రామ సర్పంచి, ఆసుపత్రి కమిటీ సభ్యులు బి.విజయలను శాలువాతో సత్కరించారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.247/2021

Between:
Plaintiff : Gubbala Thrimurthulu
And
Defendant : Bandi Satyanarayana
To.
Bandi Satyanarayana,
S/o.Subba Rao, R/o.Pedamamidipalli,
Palakol Mandal, W.G.Dt.

పై నంబరు దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున వాది పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు అమలు జరిపించమని కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా శ్రీకోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు మీకు పంపమని ఉత్తర్వులు జారి చేసినందున పై నంబరు దావాలో మీ హాజరు నిమిత్తం ది.**20-11-2024** సం.తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని.లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెనని, లేని యెడల మీ పరోక్షమందు దావా ముందు గ్రంథము జరుపబడును.

పాలకొల్లు **తోట వెంకటేశ్వరావు,** న్యాయవాది,
తేది.02-11-2024 పాలకొల్లు, ప.గో.జిల్లా.

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగంపై కేసు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగం, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేస్తున్న వ్యాపారస్తులను అదుపులోకి తీసుకున్నట్లు తహశీల్దార్ ఎం.సునిల్ కుమార్ తెలిపారు. శనివారం తహశీల్దార్ సునీల్ కుమార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. స్థానిక 9, 10 వార్డులలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను చిన్న సిలిండర్లకు మార్చి అక్రమ వ్యాపారం చేస్తున్న గజ్జవరపు శ్రీరామమూర్తి నుంచి 3, బెజవాడ ప్రసాద్ నుంచి 7, తోట రాము నుంచి 5 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గణేష్ జెకె రెస్టారెంట్ నుంచి 1 గ్యాస్ సిలిండర్, మాయాబజార్ రెస్టారెంట్ నుంచి 3 గ్యాస్ సిలిండర్లు స్వాధీన పరుచుకొని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. స్థానిక 16 వార్డులో లబ్ధిదారుల నుంచి పిడిఎస్ రైస్ కొనుగోలు చేసి మోటార్ సైకిల్‌పై అక్రమ రవాణా చేస్తున్న తూర్పు విప్పరు, ఇరగవరం మండలానికి చెందిన మాకినీడి శ్రీనివాస్‌పై 6(ఎ), 7(1) కేసులు నమోదు చేసినట్లు సునీల్ కుమార్ తెలిపారు. ఆర్ఐ కె.శివప్రసాద్, వార్డు రెవెన్యూ కార్యదర్శులు చిట్టిబాబు, వంశీ, కాంతం పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

నరసాపురం : నరసాపురం పట్టణంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ పనులు చేస్తున్నందున్న సోమవారం సాయంత్రం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. తిరిగి మంగళవారం ఉదయం యాధావిధిగా జరుగుతుందన్నారు.

పేరు మార్పు ప్రకటన

గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి గుండుగొల్లు మహంకాళి, డోర్‌నెం.15-9, పెదపేట, చర్చి దగ్గర, ఉండి, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నా పేరును గుండుగొలను శేఖర్ (పాతపేరు) తండ్రి గుండుగొలను మహంకాళి నుండి గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి గుండుగొల్లు మహంకాళిగా మార్చుకున్నాను. ఈరోజు నుండి అదుపరి అన్ని లావాదేవీల కోసం నా కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

గుండుగొల్లు చంద్రశేఖర్, S/o.మహంకాళి
డోర్‌నెం.15-9, ఉండి మండలం, ప.గో.జిల్లా.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపల్ ఆఫీసు ఏరియా, వెంకయ్యనాయుడు గారి వీధి, గంధం అపార్టుమెంట్స్ ఫ్లాట్ నెం.401రు కాపురస్తులు 1.కారిచర్ల శ్యామ్, S/o.కారిచర్ల ఆంజనేయులు 2. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ MIG-2-18 కాపురస్తులు దుమారపు వెంకన్నదొర, S/o.దుమారపు ఏడు కొండలు అను మా యొక్క 1128/1998 ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. భీమవరం మున్సిపల్ ఏరియాలోని భీమవరం పట్టణం తాలూకు రి.స.నెం.152/2, 152/3, 152/4, 169/1, 169/2, 169/3, 169/4 ర్లులో చ.గ.457 1/2లు స్థలం కలదు. దస్తావేజు నెం.1128/ 1998 గల ఒరిజినల్ దస్తావేజును ది.11-10-2024 తేదీన ఒక కవరులో పెట్టుకుని హౌసింగ్‌బోర్డు కాలనీ నుండి భీమవరం తాలూక ఆఫీసుకు వెళు చుండగా దారి మధ్యలో పడిపోయినది. సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

పంపన రవికుమార్, గుత్తుల లక్ష్మి సునీత, అడ్వకేట్స్
మోగంటి వారి వీధి, భీమవరం. సెల్: 9848444409

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 299/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) కొండేటి ఉమ మరియు యితరులు
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: కొండేటి ఉమ, W/o. సుబ్బారావు, డోర్ నెం. 4-19/1, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: పితాని సత్యనారాయణ, S/o. గాంధీ, డోర్ నెం. 21-8-11/A, యడ్లబజారు, పాలకొల్లు, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 04-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన్న విచారణ తేదీలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 100/2020

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) వేముల లక్ష్మణ మరియు యితరులు
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: వేముల లక్ష్మణ, S/o. మోహనరావు, డోర్ నెం. 4-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: వేముల సావిత్రి, W/o. లక్ష్మణ, డోర్ నెం. 4-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 07-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన్న విచారణ తేదీలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.TNK Mplty/1684/19/2024/ఇ1

తేది.02-11-2024

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. వాటర్ సప్లయి పనులు	2 నెం.లు	9.32
2. రోడ్డు పనులు	1 నెం.లు	8.14

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 04-11-2024వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- **కమిషనరు**
తణుకు పురపాలక సంఘం